సాక్షి
అనకాపల్లి
సోమవారం । 6 । నవంబర్ । 2023



నాడు వరదై... నేడు వరమై..

దశాబ్దాలుగా కన్నీటిని మిగిల్చిన కాలువే వరంగా మారింది. ఏలేరు కాలువ లీకేజీ నీటితో వరి ఏపుగా పెరుగుతోంది. 8లో



40 ఏళ్ల అభివృద్ధి

నాలుగున్నరేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధిని సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అన్నారు. 8లో



గోపూజ సేవ పునఃప్రారంభం

సింహగిరిపై శ్రీగోకులంలో ఆదివారం నుంచి గోపూజ సేవను పునరుద్ధరించారు. రూ.50 టిక్కెట్ తీసుకుని పూజ చేయవచ్చు. 8లో

న్యూస్‌రీల్

విహార యాత్రకు గిరిజన యువతీయువకులు



విహార యాత్రలో గిరిజన యువతీ యువకులు

రాంబిల్లి: ఎంఎస్ఎంఈ శిక్షణలో భాగంగా ఆదివారం గిరిజన యువతీయువకులను విహార యాత్రకు తీసుకువెళ్లారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన 9 జిల్లాల నుంచి 200 మంది గిరిజన యువతీయువకులకు ఎంఎస్ఎంఈ కేంద్రంలో వారంరోజుల పాటు శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా విశాఖ స్టీల్‌ప్లాంట్, పరవాడలో ఎన్టీపీసీ కంపెనీలతో పాటు బొజ్జన్న కొండపై బౌద్ధారామాలకు తీసుకువెళ్లారు. మరో మూడు రోజులు పాటు ఈ శిక్షణ కొనసాగనుంది. విజ్ఞానం, విషయ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఈ పరిశ్రమలతో పాటు బౌద్ధారామం యాత్రకు తీసుకు వెళ్లినట్టు ఎంఎస్ఎంఈ అధికారులు తెలిపారు.

సరుగుడు జలపాతం వద్ద సండే సందడి



సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు

నాతవరం: సరుగుడు జలపాతం వద్ద సందర్శకులు ఆదివారం సందడి చేశారు. ఎత్తైన రెండు కొండల మధ్యలోంచి చూడ ముచ్చటగా ప్రవహించే నీటిలో సందర్శకులు జలకాలాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. ఉమ్మడి విశాఖపట్నం, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతమంతా సందడిగా కనిపించింది. సరుగుడు జలపాతం వద్ద సందడి చేసిన సందర్శకులు తాండవ రిజర్వాయరును సందర్శంచి నీటి అందాలను తిలకించారు. కొంతసేపు తాండవ రిజర్వాయరుపై ఆటపాటలతో కాలక్షేపం చేశారు.

అనుమతి లేకుండా బాణసంచా తయారు చేస్తే చర్యలు

ఎస్పీ కె.వి.మురళీకృష్ణ



అనకాపల్లిటౌన్: అనుమతి లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాణసంచా లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే విక్రయించాలని చెప్పారు. జిల్లాలో శాశ్వత, తాత్కాలిక బాణసంచా తయారీ, విక్రయాల లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణసంచా విక్రయించాలని తెలిపారు. తాత్కాలిక లైసెన్సుదారులు బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల్లో ప్రత్యేక షెడ్డులలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

చిన్నారులకు ఆరోగ్య భద్రత

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఆటలాడేటప్పుడు తగిలే గాయాలు, కొద్దిపాటి జలుబు, ఇతర చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు ప్రథమ చికిత్స అందించేందుకు కేంద్రాలకు మెడికల్ కిట్లు అందజేసింది. ఈ కిట్లలో పది రకాల ఔషధాలుంటాయి.

- అంగన్‌వాడీ కేంద్రాలకు ఔషధ కిట్లు
- జిల్లాలో 1908 కేంద్రాలకు అందజేత
- ఒక్కో కిట్‌లో 10 రకాల మందులు
- పిల్లల ఆరోగ్యంపై ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ



అంగన్‌వాడీకేంద్రంలో చిన్నారులు



అంగన్‌వాడీకేంద్రాలకు అందజేసిన మెడికల్ కిట్లలో మందులు

అనకాపల్లి రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ పట్టింది. సొంత భవనాలతోపాటు, ఆంగ్ల మాధ్యమంలో బోధన, ఆటపాటలతో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తోంది. మాతాశిశు సంక్షేమానికి భారీగా నిధులు ఇవ్వడం ద్వారా కొత్త విధానాలతో అంగన్‌వాడీ కేంద్రాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు, పిల్లలు ఎవరైనా అనారోగ్యం బారిన పడినపుడు, చిన్నారులు ప్రమాదవశాత్తు గాయపడినపుడు వారికి అత్యవసర ప్రథమ చికిత్స అందించేందుకు అంగన్‌వాడీకేంద్రాలన్నింటికీ ప్రత్యేకంగా మెడికల్ కిట్లు అందజేసింది. జిల్లాలో 1908 అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాథమిక చికిత్స కిట్లను ఆ శాఖ అధికారులు అందజేశారు. ఈ కిట్లను అందజేసి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యనభ్యసిస్తున్న 84,610 మంది చిన్నారులకు భద్రత కల్పిస్తోంది. చిన్నారులు జ్వరం బారిన పడినా, ప్రమాదాలకు గురైనా వెంటనే వైద్యం అందించేలా కిట్లలో పది రకాల మందులను సమకూర్చింది. వీటిలో ఫస్ట్ ఎయిడ్‌కు వినియోగించే ఔషధాలకు ప్రాధాన్యతనిచ్చారు. పారాసిటమాల్ సిరప్, ఐరన్ ట్యాబ్లెట్లు, అయోడిన్, సిల్వర్ సల్ఫాడైజీన్, క్లోరో ఫినరామిన్ మాలియాట్, ఫురాజోలిడిన్, హ్యాండ్ శానిటైజర్, రోలర్ బ్యాండేజ్, నియోమైసిన్ ఆయింట్‌మెంట్, కాటన్, సిప్రోఫ్లాక్సిన్ చుక్కల మందు, బెంజయిల్ బెంజోయేట్, మరికొన్ని సిరప్‌లు కిట్లలో ఉన్నాయి. పిల్లలలో వచ్చే సాధారణ వ్యాధులు, ఏయే మందులను ఎంతెంత మోతాదులో ఎలా వినియోగించాలో పేర్కొంటూ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పేరుతో తెలుగులో సమాచారాన్ని కూడా స్పష్టంగా పంపించారు. మందుల వినియోగంపై వైద్య సిబ్బందితో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించారు.

జిల్లాలో వివరాలు		
అంగన్‌వాడీ కేంద్రాలు	:	1,908
గర్భిణులు	:	8,685
బాలింతలు	:	9,335
చిన్నారులు	:	8,4610

ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పర్యవేక్షణ

ప్రతి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయా కేంద్రాల పరిధిలో సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ప్రతి మూడు నుంచి నాలుగు రోజులకొకసారి పర్యవేక్షణ చేయాల్సి ఉంది. వీరు కేంద్రాల్లోని చిన్నారుల పెరుగుదల, బరువుపై పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి మందులు అందించాలి. ఆయా కేంద్రాల్లో మెడికల్ కిట్లలో ఉన్న మందులు, ఇతర సామగ్రిని అవసరమైన వారికి అందిస్తారు. కేంద్రాల్లోని చిన్నారులతోపాటు రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తారు.

చాలా ప్రయోజనకరం



అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన మెడికల్‌కిట్లు చిన్నారుల అనారోగ్య సమస్యల నివారణకు ప్రయోజనకరంగా ఉన్నాయి. చిన్న చిన్న గాయాలు తగిలినా, జ్వరం వచ్చినా, ఇతర స్వల్పకాలిక అనారోగ్య సమస్యలు వచ్చినా తరచూ డాక్టర్ల వద్దకు తీసుకు వెళ్లనవసరం లేకుండా కిట్లలోని ఔషధాలు ఉపయోగపడుతున్నాయి. చిన్నారులకు వచ్చే చర్మవ్యాధుల నివారణకు సైతం ఆయింట్‌మెంట్లు కిట్లలో ఉన్నాయి. చాలా మంచి కిట్లు అందించారు.

–కోరుమిల్లి రమ్య, అంగన్‌వాడీకేంద్రం, యలమంచిలి–2

అన్ని కేంద్రాలకు సరఫరా



జిల్లాలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు సరఫరా చేశాం చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు మందులు అందుబాటులో ఉంచాం. గతంలో కంటే ఈసారి మరిన్ని ఎక్కువ మందులతో ఇచ్చిన కిట్లు ఉపయోగకరంగా ఉన్నాయి. కేంద్రాలకు కిట్లను అందజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయం. కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

–కె.అనంతలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

110 ఘటాలతో మొక్కులు చెల్లింపు



ఘటాలు శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలి నడకన వస్తున్న భక్తులు

మాడుగుల: స్థానిక మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉచితంగా ప్రసాదం, తాగు నీరు పంపిణీ చేశారు.

110 ఘటాలతో దొరల వీధి పండగ

స్థానిక దొర్ల వీధికి చెందిన భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన 110 ఘటాలను శిరస్సున పెట్టుకుని, మేళతాళాలతో ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఉపసర్పంచ్ శ్రీనాదు శ్రీనివాసరావు, ఎంపీటీసీ పాలిమేర విజయలక్ష్మి, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో దొరల వీధి ప్రజలు పండగ నిర్వహించారు.

క్రికెట్ స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆస్ట్రేలియా టీ20 సిరీస్‌లో భాగంగా ఈ నెల 23న విశాఖలో జరగనున్న మ్యాచ్‌కు సంబంధించి స్టేడియంలో భద్రత ఏర్పాట్లను విశాఖ నగర సీపీ రవిశంకర్, ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్.ఆర్.గోపినాథ్‌రెడ్డి, కోశాధికారి ఎ.వి.చలం ఆదివారం పరిశీలించారు. స్టేడియం వెలుపల, లోపల, ఆటగాళ్ల ప్రవేశ ద్వారాలు, పార్కింగ్‌కు కేటాయించిన ప్రాంతాలను పరిశీలించారు.

వచ్చే నెలాఖరుకు జగనన్న భూ రీసర్వే పూర్తి

నర్సీపట్నం ఆర్డీవో జయరామ్



సూచనలిస్తున్న ఆర్డీవో జయరామ్

నాతవరం: జగనన్న భూ రీసర్వేను నర్సీపట్నం రెవెన్యూ డివిజన్‌లో వచ్చే నెలాఖరులోగా పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ తెలిపారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పుల కోసం నాతవరం, మర్రిపాలెం పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్ అధికారులు, సూపర్‌వైజర్ల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాంటి వారిలో మార్పురాకపోతే కలెక్టరు దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, కొంతమంది వీఆర్వోల పని తీరులో మార్పురావాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు ఈ నెల, వచ్చే నెలలో ఓటర్ల చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కమిషనర్ సూచనల మేరకు 2024 జనవరి నాటికి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్టు చెప్పారు. రెవెన్యూ డివిజన్‌లో జగనన్న రీసర్వే పథకంలో మొదట విడతలో 50 రెవెన్యూ గ్రామాల్లో, రెండవ విడత 102 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. మూడవ విడతలో 85 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని, వచ్చే నెలాఖరులోపు పూర్తి చేస్తామన్నారు. గిరిజన గ్రామాల్లో అర్హత ఉన్న గిరిజనులకు ఆర్వోఎఫ్ఆర్ పత్రాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్ నాయుడు, డీటీ చైన్లు ఆర్ఐ హరి, వీఆర్వో బొత్స శ్రీనివాస్ పాల్గొన్నారు.

27న శూలాల మహోత్సవం

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో ఈ నెల 27న శూలాల మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు సాంబశివుని ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవం నిర్వహణపై గ్రామస్తులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవం విజయవంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఉదయం 4గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఉత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్య నాయుడు, పెద్దలు ఆడారి కాశీబాబు, పాలిమేర గణేష్, పాలిమేర కృష్ణ, కోరుకొండ ప్రసాద్, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లిలో స్పోర్ట్స్ స్కూలు ఏర్పాటుకు కృషి

- అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి
- ముగిసిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలు



ద్వితీయ స్థానం పొందిన విశాఖ జిల్లా బాలుర జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం





మొదటి స్థానంలో నిలిచిన కడప జిల్లా బాలికలు, బాలుర జట్లకు షీల్డ్ అందజేస్తున్న అనకాపల్లి ఎంపీ సత్యవతి

నక్కపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నక్కపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి 67వ హాకీ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి నక్కపల్లిలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అవసరమైన సదుపాయాల కల్పనకు ఎంపీ నిధులు కూడా కేటాయిస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యా, క్రీడారంగాలకు అధిక ప్రాధ్యాన్యం ఇస్తోందన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు 'ఆడుదాం ఆంధ్రా 'అనే కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, త్వరలోనే ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. నక్కపల్లి బీఎస్ హాకీ క్లబ్‌లో తర్ఫీదు పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచి, మండలానికి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. క్లబ్ వ్యవస్థాపకులు సూరిబాబు, తాతాజీలను, హాకీ క్రీడాకారులకోసం రూ.9 లక్షల వ్యయంతో క్రీడామైదానాన్ని అభివృద్ధి చేసిన హెటిరో పరిశ్రమ యాజమాన్యాన్ని అభినందించారు. జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక అభివృద్ధి సదుపాయాల కల్పనా సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి వేదిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, హెటిరో డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్‌లు నేతల రత్నకుమారి, భార్గవ్, సాదిరెడ్డి శ్రీను ఎంపీటీసీ గొర్ల గోవిందు, కె.బుజ్జి, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, శేఖర్, ఎంఈవో కుంచం నరేష్, పర్యవేక్షకులు నూకరాజు, శ్రీనివాసరావు, ఎస్‌వీఎస్ఆచార్యులు పాల్గొన్నారు.

విజేత వైఎస్సార్ కడప జిల్లా

ఈ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో ప్రథమ స్థానాన్ని వైఎస్సార్ కడప జిల్లా జట్లు కైవసం చేసుకున్నాయి. బాలుర విభాగంలో ద్వితీయ స్థానాన్ని విశాఖపట్నం, తృతీయ స్థానాన్ని అనంతపురం జట్లు కైవసం చేసుకోగా బాలికల విభాగంలో ద్వితీయ స్థానాన్ని అనంతపురం, తృతీయ స్థానాన్ని చిత్తూరు జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామృష్ణ బహుమతులు అందజేశారు.

క్రీడామైదానంలో జై జగన్ నినాదాలు..

ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేసే సందర్భంలో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతులు కైవసం చేసుకున్న వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు జై జగన్ అంటూ నినాదాలు చేశారు. కడప జిల్లా క్రీడాకారులను ఎంపీ, తదితరులు అభినందిస్తూ ప్రసంగిస్తుండగా క్రీడాకారులంతా ఒక్కసారిగా కేరింతలు కొట్టారు. జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేయడం విశేషం.

క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

- శబరిమల, పంచారామాలకు ప్యాకేజీలు
- లంబసింగి, అరకు, ధారమఠంకు బస్సులు



డాబాగార్డెన్స్(విశాఖ): శబరిమలై వెళ్లే అయ్యప్ప స్వామి భక్తుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, విశాఖపట్నం రీజియన్ ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 5, 6, 7 రోజుల ప్రత్యేక ప్యాకేజీలు రూపొందించింది. అయ్యప్ప స్వాముల సేవలో విశేష అనుభవం కలిగిన సుశిక్షితులైన డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం అందజేస్తుంది. ఉమ్మడి విశాఖ జిల్లాలతో పాటు నౌరంగపూర్, కోరాపుట్, జైపూర్ ప్రాంతాల నుంచి కూడా అయ్యప్ప భక్తుల కోసం అమరావతి, ఇంద్ర, సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సు సర్వీసులు నడపనుంది.

శబరిమలై ప్యాకేజీ వివరాలు

5 రోజుల యాత్ర: విజయవాడ, మేల్ మరవత్తూర్, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, విజయవాడ.
ప్రయాణచార్జీ (ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.6,600, అల్ట్రా డీలక్స్ రూ.6,550

6 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,000, అల్ట్రా డీలక్స్ రూ.6,900

7 రోజుల యాత్ర: విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, పళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం తిరుగు ప్రయాణంలో మధురై, రామేశ్వరం, తిరుపతి, శ్రీకాళహస్తి, విజయవాడ, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

7 రోజుల యాత్ర: విజయవాడ, శ్రీకాళహస్తి, బెంగళూరు, మైసూరు, గురువాయూర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం. తిరుగు ప్రయాణంలో శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, ద్వారపూడి, అన్నవరం.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): సూపర్ లగ్జరీ రూ.7,500, అల్ట్రా డీలక్స్ రూ.7,450

రిజర్వేషన్ కోసం ముందస్తుగా https://www.apsrtconline.inలో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. లేదా ద్వారకా బస్ స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో బుకింగ్ సౌకర్యం ఉంది.
సంప్రదించాల్సిన నంబర్లు: 99592 25602, 73829 21540, 99592 25594, 91001 09731, 73829 14219, 9959 221199

పంచారామ క్షేత్ర దర్శిని

హిందూ సంప్రదాయంలో కార్తీక మాసంకు విశేష ప్రాముఖ్యం ఉంది. లయకారుడైన ఆ పరమశివుడిని కార్తీక మాసంలో, అందులో సోమవారం రోజున దర్శిస్తే సకల పాపాలు తొలగుతాయని ప్రతీతి. అందువల్ల ఈ ఏడాది కార్తీక మాసంలో ఐదు ప్రముఖ శైవక్షేత్రాలు దర్శించుకునే భక్తుల కోసం ఆర్టీసీ పంచారామ క్షేత్ర దర్శినిని ప్రవేశపెట్టింది. కార్తీకమాసంలో వచ్చే ప్రతీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. మరుసటి రోజు సోమవారం ఉదయం అమరావతి(అమరేశ్వరుడు), భీమవరం(భీమేశ్వరుడు), పాలకొల్లు(క్షీర రామలింగేశ్వరుడు), ద్రాక్షారామం(భీమలింగేశ్వరుడు), సామర్లకోట(కుమార రామలింగేశ్వరుడు) దర్శనాలుంటాయి.

ఏయే రోజుల్లో..

ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10 తేదీల్లో సాయంత్రం 5 గంటలకు విశాఖ ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి.
ప్రయాణచార్జీ(ఒక్కరికి): సూపర్‌లగ్జరీ రూ.2,100, అల్ట్రాడీలక్స్ రూ.2050

లంబసింగి టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని పిక్నిక్‌ల సందడి దృష్ట్యా ఆర్టీసీ లంబసింగికి ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ బస్సులు శని, ఆదివారాల్లో ఉదయం 3 గంటలకు ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరుతాయి. లంబసింగి, తాజంగి డ్యామ్, కొత్తపల్లి వాటర్‌ఫాల్స్, మోదమాంబ గుడి(పాడేరు), కాఫీ తోటలు చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

అరకు టూర్

కార్తీకమాసం పురస్కరించుకుని ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 6 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి బస్సులు బయలుదేరుతాయి. డముకు వ్యూ పాయింట్, గాలికొండ వ్యూ పాయింట్, చాపరాయి, పద్మాపురం గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.800, ఎక్స్‌ప్రెస్ రూ.650

ధారమఠం

కార్తీక మాసంలో వచ్చే ప్రతీ శని, ఆదివారాల్లో ఉదయం 7 గంటలకు ద్వారకా బస్ స్టేషన్ నుంచి ధారమఠంకు సర్వీసులు బయలుదేరుతాయి. శివాలయం, ధారమఠం వాటర్ ఫాల్స్, అల్లూరి సీతారామరాజు మ్యూజియం, బొజ్జన్నకొండ(అనకాపల్లి) చూపిస్తారు.
ప్రయాణ చార్జీ(ఒక్కరికి): అల్ట్రా డీలక్స్ రూ.650, ఎక్స్‌ప్రెస్ రూ.550

క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో గుర్తు తెలియని మృతదేహం


లూప్‌లైన్‌లో గుర్తు తెలియని మృతదేహం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి రైల్వే స్టేషన్ లూప్‌లైన్(డీఎన్‌లైన్)లో ఆదివారం రాత్రి రైలు ఢీకొని సుమారుగా 45 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతరామ్ ఆదివారం చెప్పారు. మృతుడు గోధుమరంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, ఆకుపచ్చరంగు లుంగీ, ఎరుపు, తెలుపు రంగు అడ్డుగీతల టవల్ ధరించి ఉన్నట్టు ఎస్‌ఐ చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు. మరిన్ని వివరాలకు 7673906010 నంబరును సంప్రదించాలని కోరారు.

22 కేజీల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్టు


వివరాలను తెలుపుతున్న సీఐ తాతారావు

కె.కోటపాడు: మండలంలో ఆనందపురం కూడలి వద్ద శనివారం రాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు నిందితులను తనిఖీ చేయగా, వారి నుంచి 22 కిలోల గంజాయి పట్టుబడినట్లు కె.కోటపాడు సీఐ ఎస్.తాతారావు తెలిపారు. ఈ వివరాలను ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కేరళకు చెందిన అబీద్‌మాన్ కేపీ, మహ్మద్ అన్సర్ జాఫర్‌లను పట్టుకుని, వీరి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పాడేరు, హుకుంపేట మీదుగా ఆనందపురం నుంచి కొత్తవలసకు తరలించే క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసును నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితులను పట్టుకున్న వారిలో ఎ.కోడూరు ఎస్ఐ బి.రామకృష్ణ ఉన్నారు.

సింహగిరిపై గోపూజలు పునఃప్రారంభం

సింహాచలం: సింహగిరిపై శ్రీగోకులంలో ఆదివారం నుంచి గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో గతంలో గోపూజలు నిర్వహించేవారు. కొన్ని కారణాల వల్ల వాటిని నిలిపివేశారు. ఇటీవల దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీనివాసమూర్తి భక్తుల సౌకర్యార్థం గోపూజలను పునరుద్ధరించారు. శ్రీగోకులంలో ఎనిమిది మేలు జాతి కపిల గోవులను ఉంచారు. అలాగే శ్రీగోకులం వద్దే టికెట్టు కౌంటరును కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. భక్తులు రూ.50 టికెట్టు తీసుకుని గోపూజ నిర్వహించుకోవచ్చని ఈవో తెలిపారు.

నాడు వరదై... నేడు వరమై..

- ఏటా ఏలేరు కాలువ లీకేజీతో పొలాలకు ముంపు
- ఈ ఏడాది అదే నీటితో ఏపుగా పెరిగిన వరి పంట


ఏలేరు లీకేజీ నీటితో ఏపుగా పెరిగిన వరి పంట


నిండుగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ నీరు

నాతవరం: కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. దశాబ్దాలుగా కన్నీటిని మిగిల్చిన ఆ కాలువే నేడు రైతులకు వరంగా మారింది. తుపాన్ల సమయంలో కురిసే అధిక వర్షాలకు ఏలేరు కాలువ లీకేజీ అయి పొలాలు ముంపునకు గురయ్యేవి. ఇప్పుడు అవే పొలాల్లో లీకేజీ నీటితో వరి పంట ఏపుగా పెరుగుతోంది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు తరలిస్తున్న కాలువ నీరు ప్రస్తుతం ఊపిరిపోస్తోంది. నాతవరం మండలం పి.జగ్గంపేట, పి.కె.గూడెం, ధర్మవరం, గునుపూడి పెదగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం, చినగొలుగొండపేట, ఎ.పి.పురం, మన్యపురట్ల, ఎం.బి.పట్నం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీల మీదుగా 26 కిలోమీటర్ల మేర పొడవునా ఏలేరు కాలువ నీరు ప్రవహిస్తోంది. వాటిలో జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీలకు చెందిన భూములు మాత్రమే కాలువకు ఎత్తులో ఉండగా, మిగతా పంచాయతీలో భూములన్నీ కాలువకు దిగువన ఉన్నాయి. ఏటా తుపాను వర్షాలకు ఏలేరు కాలువ నీరు ఉప్పొంగి ప్రవహించడంతో ఇరువైపులా పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దాంతో పొలాల్లోకి చేరిన ముంపు నీటిని తరలించేందుకు రైతులు నానా అవస్థలు పడేవారు. ఈ సమస్యపై ఏలేరు అధికారులకు పలుమార్లు విన్నవించినా నిస్సహాయత వ్యక్తం చేసేవారు. ఇక్కడ కాలువ ఎత్తులో ఉండటం, నీరు నిండుగా ప్రవహించటం, పల్లపు ప్రాంతంలో పొలాలు ఉండటం మూలంగా అధికారులు ఎన్ని జాగ్రత్త చర్యలు చేపట్టినా లీకేజీ నీరు అరికట్టకపోతున్నారు. ఈ ఏడాది మాత్రం తుపాన్లు లేకపోవడంతో ఏటా ముంపునకు గురి చేసే లీకేజీ నీరు ఈ ప్రాంత రైతులకు ప్రధాన ఆధారంగా మారింది. తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం తక్కువగా ఉన్నందున ఖరీఫ్ సాగుకు నీరు పొదుపుగా వాడుకోవాలని ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు. శివారు ఆయకట్టుకు రైతులు ఆశించిన విధంగా తాండవ నుంచి నీరు సరఫరా కావడం లేదు. ఈ నేపథ్యంలో ఏలేరు కాలువ లీకేజీ నీరు వరదాయినిగా మారింది. ప్రాజెక్టు నీటితో పని లేకుండా ఏలేరు లీకేజీతో వరి పంట ఏపుగా పెరుగుతోంది. గతంలో ఏలేరు కాలువ లీకేజీ నీరు కారణంగా అనేక బాధలు పడేవారమని, అదే నీరు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆదుకుంటోందని ఈ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

11న మాదిగల విశ్వరూప మహాసభకు తరలిరండి

ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి ముమ్ముడివరపు చినసుబ్బారావు మాదిగ


మహాసభ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

పాయకరావుపేట: హైదరాబాద్‌లో ఈ నెల 11న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు రాష్ట్రంలోని మాదిగ, రెల్లి ఉప కులస్తులు లక్షలాదిగా తరలిరావాలని ఉత్తర, కోస్తా జిల్లాల ఎమ్మార్పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి ముమ్ముడివరపు చినసుబ్బారావు మాదిగ పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో సన్నాహక సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిన సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్య అతిథిగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ విచ్చేస్తున్న విశ్వరూప మహాసభకు ప్రతీ గ్రామం నుంచి పెద్ద ఎత్తున యువత, కార్యకర్తలు, మహిళలు తరలి రావాలని కోరారు. అనంతరం సభకు సంబంధించి పోస్టరు విడుదల చేశారు. ఎంఎస్పీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి కడితి సాధూరావు, ఎంఈఎఫ్ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పెట్ల వెంకటరమణ, ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ ఉత్తరాంధ్ర కో కన్వీనర్ తొత్తరమూడి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కొల్లి చినఅప్పారావు, కట్టుమూరి మంగరాజు, ఎలుసూరి ఘూటీలు, గొటివాడ సామ్రాట్ కుమార్, యలకా మల్లిబాబు, నీటిపల్లి ముత్యాలు, తుమ్మలపల్లి లక్ష్మణరావు, సలికే గోవిందరావు, కశింకోట సత్తిబాబు, ఇల్లపు అప్పారావు, కుందూరు కుమార్, గంపల సుబ్బారావు, గంపల రాంబాబు, కడింపల్లి చంటిబాబు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయానికి చిలకలూరిపేట శిలలు


శిలలకు పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెం నూకాంబిక దేవస్థానం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఐదు లేయర్ల శిలలు గుంటూరు జిల్లా చిలకలూరిపేట నుంచి తెప్పించినట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఇక్కడ ఆలయ ఆవరణలో శిలలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సారథ్యంలో టీటీడీ నుంచి రూ.1.50 కోట్లు, దేవస్థానం నుంచి రూ.8.50 కోట్లతో ఈ పనులు చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది కొత్తఅమావాస్య ఉత్సవానికి ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు బుద్ద నర్సింగరాజు, కొండూరి రవీంద్ర, పాము అనురాధ సన్నిబాబు, పీలా లక్ష్మీశ్రీనివాస్, ఆడారి ఉమాశ్రీనివాసరావు, మళ్ల వరపు ఈశ్వరరావు, గొల్లవిల్లి నర్సింగరావు, యనమండ్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలోనే 40 ఏళ్ల అభివృద్ధి

- ప్రజల్లోకి వెళ్లి ఓటడిగే అర్హత వైఎస్సార్‌సీపీకే ఉంది
- పాయకరావుపేట నియోజకవర్గంలో రూ.500 కోట్ల అభివృద్ధి పనులు
- ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ


దేవవరంలో స్థానిక నాయకులను కలిసిన అమ్మాజీ

నక్కపల్లి: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో నలభై ఏళ్ల అభివృద్ధి చేసి చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ అన్నారు. పేదలకు మేలు చేకూర్చే సంక్షేమ పథకాలను దళారుల ప్రమేయం లేకుండా అమలు చేయగలిగిన సత్తా, ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఆదివారం ఆమె నక్కపల్లి మండలం దేవవరం, ఒడ్డిమెట్టలలో మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి కార్డు దారులకు బియ్యం అందజేశారు. సంక్షేమ పథకాల అమలు తీరు ఎలా ఉందని లబ్ధిదారులను ఆరా తీశారు. రేషన్ సరుకులు డోర్ డెలివరీపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాలతోపాటు మేనిఫెస్టోలో పొందుపరచిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలన్నింటిలో జన్మభూమి కమిటీల పాత్ర కీలకంగా ఉండేదన్నారు. కమీషన్లు ఇవ్వనిదే లబ్ధిదారులకు పథకాలు మంజూరు చేసే వారు కారన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటువంటి అరాచకాలకు చరమగీతం పలికారన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకే నేరుగా అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాయకరావుపేట నియోజకవర్గంలో రూ.500 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. నియోజకవర్గ చరిత్రలో ఇటువంటి అభివృద్ధి మరే ప్రభుత్వంలో చేయలేదన్నారు. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల ఏర్పాటు, 30 పడకల ఏరియా ఆస్పత్రులను 50 పడకల స్థాయికి పెంచి రూ.6 కోట్లతో అదనపు భవనాలు నిర్మించారన్నారు. రూ.3 కోట్లతో ఎస్.రాయవరం, పాయకరావుపేటలో నూతన పీహెచ్‌సీ భవనాలు నిర్మించామన్నారు. రూ.200 కోట్లతో 203 పాఠశాలల్లో నాడు – నేడు కింద అదనపు భవనాలు, డిజిటల్ క్లాసు రూములు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రూ.200 కోట్లతో జలజీవన్‌మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.110 కోట్లతో సచివాలయాలు, ఆర్బీకేలు వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. పలు గ్రామాలకు తారురోడ్లు సదుపాయం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 9 వేల మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశామన్నారు. 12 వేల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశామన్నారు. ప్రజల్లోకి వెళ్లి ధైర్యంగా ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ఆ అర్హత టీడీపీకి లేదన్నారు. సర్పంచ్ గొర్ల రాఘవకుమారినర్సింహమూర్తి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, పార్టీ సీనియర్ నాయకులు దండు బలరామరాజు, అంగరాజు పెదరాOము, రమణ, పి. సూరిబాబు పాల్గొన్నారు.

వలంటీర్ కుటుంబానికి రూ.5 లక్షల అందజేత


వలంటీర్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు రామారావుపేటకు చెందిన వలంటీర్ ముడుగు దేవయ్య కుటుంబానికి ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ రూ.5 లక్షల చెక్కు అందజేశారు. వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దేవయ్య కరోనా సమయంలో రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. అతడి కుటుంబం పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి నుంచి ఈ మొత్తం మంజూరు చేయించారు. వలంటీర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించటం పట్ల వార్డు వలంటీర్లు థాంక్యూ సీఎం అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, పార్టీ నాయకులు కిల్లాడ లోవరాజు, ఎల్లేటి శ్రీను, యాదగిరి శేషు పాల్గొన్నారు.

పాన్‌షాపులో చోరీ

ఎస్.రాయవరం: రేవుపోలవరం గ్రామంలో ఓ పాన్ షాపులో చోరీ జరిగి అర తులం బంగారం, రూ.5 వేలు నగదు పోయినట్టు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ప్రసాద్‌రావు తెలిపారు. గ్రామానికి చెందిన కోడ దుర్గ అనే మహిళకు చెందిన పాన్‌షాపులో శనివారం రాత్రి చోరీ జరిగిందన్నారు. వివరాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

దేవస్థానం భూ ఆక్రమణపై గ్రామస్తుల ఆగ్రహం

- టీడీపీ నాయకుడు, వ్యాపారి వేసిన మొక్కలను పీకేసిన ప్రజలు
- 100 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడాలని అధికారులకు వినతి


టీడీపీ నాయకుడు, వ్యాపారి కలిసి ఆక్రమించిన ప్రభుత్వ భూమి


దేవస్థానం భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: దేవస్థానానికి కేటాయించిన భూమిని ఆక్రమించి, మొక్కలు వేసిన టీడీపీ నాయకుడు, అనకాపల్లికి చెందిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని బుచ్చెయ్యపేట మండలం చిన భీమవరం గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. దేవస్థానానికి చెందిన భూమితో పాటు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ వేసి, మొక్కలు నాటడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవస్థానం భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను, మొక్కల్ని తొలగించారు.

గ్రామస్తులు అంతా ఏకాభిప్రాయంతో 40 ఏళ్ల క్రితం గ్రామదేవత పడమటమ్మ, రామాలయాల అభివృద్ధికి సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూమిని సమీకరించారు. ఈ భూమిలో వచ్చిన ఫలసాయంతో ఏటా గ్రామ దేవతల పండగలను ఘనంగా నిర్వహించేవారు. ఈ భూమిని అప్పట్లో అనకాపల్లికి చెందిన వ్యాపారికి సరుగుడు, యూకలిప్టస్ తోటలు సాగు చేసి, సగం ఫలసాయం గ్రామదేవతలకు కేటాయించేందుకు ఒప్పందం చేసుకున్నారు. అప్పటి నుంచి తోటల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సదరు వ్యాపారి గ్రామ పెద్దలకు అందించేవారు. తాజాగా గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, దేవస్థాన భూముల్ని సాగు చేస్తున్న వ్యాపారి కలిసి వారి కుటుంబ సభ్యుల పేరున గ్రామస్తులకు తెలియకుండా పట్టాలు సృష్టించారు. 70 ఎకరాలకు పట్టాలు తయారు చేయించి, దేవస్థానం భూమిని ఆక్రమించినట్లు కవల అప్పల సత్యనారాయణ, పువ్వుల రాజారావు, రాజాన చిన అప్పలనాయుడు, తాళపురెడ్డి అప్పారావు, సేనాపతి నానాజీ తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పడమటమ్మ గుడిని ఆనుకున్న భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను, కొబ్బరి, జామ తదితర మొక్కలను తొలగించారు. దేవస్థానానికి చెందిన ప్రభుత్వ భూమిని అధికార్లు కాపాడాలంటూ గుడి వద్ద ఆందోళనకు దిగారు.

కాగిత సత్యవతి, మలపాక శ్రీను, నిట్టా సత్యారావు, వెలంకాయల నాగరాజులు వారి కుటుంబ సభ్యుల పేరున ఉన్న 16 ఎకరాల భూమి ఆక్రమణకు గురైనట్లు ఆరోపించారు. దీని వెనుక టీడీపీ నేత, సదరు వ్యాపారే ఉన్నట్లు పేర్కొన్నారు. దీనిపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఇరు వర్గాలు ఫిర్యాదు చేయడంతో, ఎస్ఐ కుమారస్వామి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గొడవలు పడకుండా రెవిన్యూ అధికార్ల రికార్డుల పరిశీలన ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.

కణుజును వేటాడిన కేసులో నలుగురి అరెస్టు


అటవీ శాఖ అధికారుల సమక్షంలో కణుజు కళేబర వ్యర్థాల ఖననం

కశింకోట: మండలంలోని జి.భీమవరం వద్ద అటవీ ప్రాంతంలో వన్యప్రాణి కణుజును వేటాడి చంపిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు అనకాపల్లి ఫారెస్టు సెక్షన్ అధికారి వి.వి.ఎస్.కె వర్మ ఆదివారం రాత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు వివరించారు. జి.భీమవరం గ్రామం వద్ద కొండపై అటవీ ప్రాంతంలో ఈ నెల 2న రాత్రి తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటకు చెందిన సింగంపల్లి నగేష్, ఎండేటి మూర్తి, గొలగాని రమణలతోపాటు వెళ్లి అక్కడి చెరువులో నీరు తాగడానికి వచ్చిన వన్య ప్రాణి కణుజును నాటు తుపాకీతో కాల్చారు. అది సుమారు 150 మీటర్ల దూరం వెళ్లి కింద పడి మరణించింది. ఈ విషయాన్ని గుర్తించిన తర్వాత వారు జి. భీమవరం గ్రామం వచ్చి ద్వారపురెడ్డి ఏసు, కోసూరి పెంటయ్యలను తీసుకొని 3వ తేదీన కొండ ప్రాంతానికి వెళ్లి మృతి చెందిన కణుజును ముక్కలుగా కోసి మాంసం వాటాలుగా పంచుకొని తమ ఇళ్లకు తీసుకెళ్లారు. దీనిలో చిరికి రాజుబాబుకు మాంసం కొంత మేర ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ విషయం బయటకు తెలియడంతో విశ్వసనీయ వర్గాల ద్వారా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అటవీ శాఖ అధికారులు రంగంలోకి దిగి రాజుబాబు ఇంట్లో దొరికిన మాంసం ఎలా వచ్చిందని విచారించగా అసలు విషయం వెల్లడైంది. దీంతో కేసు నమోదు చేసి కణుజు మాంసం, ఉడికించిన మాంసం, రెండు కత్తులు స్వాధీనం చేసుకొని నిందితుల్లో ఏసు, మూర్తి, రమణ, రాజుబాబులను అరెస్టు చేశారు. కణుజును తుపాకీతో చంపిన ప్రధాన నిందితుడు నగేష్‌తోపాటు కోసూరు పెంటయ్య పరారీలో ఉన్నారని అటవీ శాఖ అనకాపల్లి ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వి.వి.ఎస్.కె వర్మ తెలిపారు. పాడేరు డిప్యూటీ సీఎఫ్, డీఎఫ్ఓ కె. వినోద్‌కుమార్, అనకాపల్లి డీఎఫ్‌వో బి. రాజారావు విచారించి నేరాన్ని కేసులో నిర్ధారించారన్నారు. వన్య ప్రాణులను వేటాడి చంపితే 3 నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు.

కణుజు కళేబరం ఖననం

ఇదిలా ఉండగా అటవీ శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని సందర్శించి స్వాధీనం చేసుకున్న కణుజు కళేబర వ్యర్థాలను కొత్తూరు ఎన్జీఓ కాలనీ శ్మశాన వాటికలో వద్ద అటవీ శాఖ అధికారులు, స్థానికుల సమక్షంలో ఆదివారం ఖననం చేశారు. కార్యక్రమంలో పాడేరు డీసీఎఫ్ కె. వినోద్‌కుమార్, అనకాపల్లి డీఎఫ్‌వో కె. రాజారావు, సర్పంచ్ ఎస్. లక్ష్మీప్రసన్న, కశింకోట ఇన్‌ఛార్జి తహసీల్దార్ కె. సురేష్‌నాయుడు, వీఆర్‌వో భరద్వాజ్, అనకాపల్లి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పి. జ్యోతిరమ్య, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వి.వి.ఎస్.కె వర్మ, కస్నూరుపాలెం బీట్ ఆఫీసర్ సంజీవరావు పాల్గొన్నారు.

కడలి హోరు.. పరుగు జోరు

- ఉత్సాహంగా వైజాగ్ నేవీ మారథాన్
- కిక్కిరిసిన సాగరతీరం


నేవీ మారథాన్‌లో ఉద్యోగులు, యువత


మారథాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న అమ్మాయిలు

విశాఖ స్పోర్ట్స్: ఒకవైపు కడలి అలల హోరు.. మరోవైపు పరుగువీరుల జోరుతో విశాఖ సాగరతీరంలో పండగ వాతావరణం నెలకొంది. లేలేత సూర్యుని కిరణాలు పలకరిస్తుండగా వేలాది మంది యువత, నేవీ ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హుషారుగా పరుగు పెట్టారు. వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్‌లో భాగంగా ఐదు కిలోమీటర్ల ఫన్ విభాగంలో ఔత్సాహికులు సరదాగా పరుగు పెడితే.. మిగిలిన విభాగాల్లో అథ్లెట్లు విజయమే లక్ష్యంగా శ్రమించారు. ఒంపు సొంపులు తిరిగిన తీరం వెంట సాగిన పరుగు.. అథ్లెట్లకు ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. ఈ మారథాన్‌లో మారిషస్ అథ్లెట్లు, స్థానిక చిన్నారులు పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

విశాఖ సాగరతీరంలో ఆదివారం వైజాగ్ నేవీ మారథాన్ 8వ ఎడిషన్ ఉత్సాహంగా జరిగింది. 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్, 10 కిలోమీటర్ల రేస్‌తో పాటు ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగులో వేలాది మంది పాల్గొన్నారు. ఫుల్ మారథాన్‌ను తూర్పు నావికాదళ కమాండ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, హాఫ్ మారథాన్‌ను వైస్ అడ్మిరల్ శ్రీనివాసన్, 10కె రన్‌ను సీపీ రవిశంకర్ ప్రారంభించారు. ద పార్క్ హోటల్ సర్కిల్ దరి వైఎస్సార్ విగ్రహం వద్ద మారథాన్ రేసులతో పాటు ఫన్ పరుగును అథ్లెట్లు, యువతీయువకులు ప్రారంభించారు. ఆర్.కె.బీచ్ మీదుగా నేవల్ కోస్టల్ బ్యాటరీ వద్ద యూటర్న్ తీసుకున్నారు. కాళీమాత ఆలయం మీదుగా ఏడువేల మంది ఔత్సాహికులు పాల్గొన్న ఐదు కిలోమీటర్ల ఫన్ పరుగు ఎంజీఎం పార్క్ వద్ద ముగిసింది. మిగిలిన మూడు కేటగిరీల్లో పరుగు ఐఎన్ఎస్ కళింగ వైపు సుందరమైన సాగరతీరం మీదుగా కొనసాగింది. 2,700 మంది పాల్గొన్న 10 కిలోమీటర్ల పరుగు తెన్నేటి పరుగు వద్ద యూటర్న్ తీసుకోగా హాఫ్ మారథాన్ పరుగువీరులు రుషికొండ గాయత్రి కళాశాల దగ్గర యూ టర్న్ తీసుకున్నారు. పూర్తి మారథాన్‌లో పాల్గొన్న 500 మంది అథ్లెట్లు ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని చేపలుప్పాడ దగ్గర యూటర్న్ తీసుకున్నారు. వీఎంఆర్డీఏ పార్క్‌లో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో సీనియర్ నావికాదళ అధికారులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. డీహైడ్రేషన్, వైద్య శిబిరాలు, కన్వీనియన్స్ స్టేషన్లు, రన్నర్స్‌ను ఉత్సాహపరిచేందుకు మార్గంలో వినోద కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పలు పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు.

విజేతలు వీరే..

పురుషుల ఓపెన్ విభాగంలో శిఖంధర్ తడాఖే 2.30 గంటల్లో పూర్తి చేసి విజేతగా నిలవగా హాఫ్ మారథాన్‌ను దీపక్ కుంబార్ 1.06 గంటల్లో పూర్తి చేశారు. 10 కిలోమీటర్ల పరుగును సోను కుష్వా 31 నిమిషాల్లో పూర్తి చేసి విజేతగా నిలిచారు. మహిళా విభాగంలో ఆశా 3.08 గంటల్లో పూర్తి చేయగా.. లిలియన్ రుట్టో హాఫ్ మారథాన్‌ను 1.20 గంటల్లో, 10 కిలోమీటర్ల పరుగును మేరీగ్రేస్ 44 నిమిషాల్లో పూర్తి చేసి విజేతలుగా నిలిచారు.

క్లుప్తంగా

బస్సు యాత్రపై సమావేశం నేడు

అనకాపల్లిటౌన్: స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు జోనల్ పరిధిలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు, దేవస్థానాల చైర్మన్లు, జేఏసీ ఇన్‌చార్జిలు, ఆలయ ధర్మకర్తలు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, అభిమానులు హాజరు కావాల్సిందిగా కోరారు.

నేడు కొప్పాకలో జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి యూపీహెచ్‌సీ, కొప్పాక సచివాలయం పరిధి ప్రజలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

హాస్టల్ విద్యార్థులకు ట్రంకు పెట్టెల వితరణ



ట్రంకు పెట్టెలు అందిస్తున్న బుల్లిబాబు

కశింకోట: స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం విద్యార్థులకు అనకాపల్లి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ట్రంకు పెట్టెలను అందించారు. వసతిగృహ విద్యార్థులు తమ పుస్తకాలు, సామాన్లు భద్రపరచుకునేందుకు వీలుగా ఈ పెట్టెలను వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని అభిలషించారు. రోటరీ క్లబ్ ప్రతినిధులకు వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రత్యేక ఓటరు శిబిరానికి స్పందన

కశింకోట: మండలంలోని 71 పోలింగ్ బూత్‌లలో రెండో రోజు ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓట రు నమోదు, సవరణల శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 83 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో కొత్త ఓటరు నమోదు కోసం 45, ఓట్ల తొలగింపు, బదిలీకి 16, ఓటర్ల జాబితాలో మార్పు లు, చేర్పుల కోసం 22 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.సురేష్‌నాయుడు వెల్లడించారు. కశింకోటలోని డీపీఎస్ జెడ్పీ హైస్కూల్లో పంచాయతీ కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు శిబిరాన్ని నిర్వహించారు.

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
మ్యాడ్	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
---	: వెంకటేశ్వర
ఘోస్ట్	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 48 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-4 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 365 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 253 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

సొంతింటి కల.. సాకారమవుతున్న వేళ

- శరవేగంగా జగనన్న గృహాల నిర్మాణం
- డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చర్యలు

ఒకప్పటి ఖాళీ ప్రభుత్వ స్థలాలు ఇపుడు కొత్త ఊళ్లుగా మారిపోయాయి. పేదవాడి సొంతింటి కల నెరవేరేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి స్థలంతో పాటు, శాశ్వత ఇంటిని కూడా మంజూరు చేసి జగనన్న లేఅవుట్‌లు ఏర్పాటుచేశారు. దీంతో ప్రతి గ్రామంలో నూతన ఊళ్లు తయారయ్యాయి. అన్ని మౌలిక వసతులతో నివాసయోగ్యంగా మారాయి. దీంతో జగనన్న లేఅవుట్‌లు పేదవాడి సొంతింటి కలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి.



జగనన్న కాలనీలో నిర్మాణం పూర్తయిన ఇల్లు



దాదాపు పూర్తయిన శంకరం జగనన్న లేఅవుట్

తుమ్మపాల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. మండలంలో 31 పంచాయతీలకు గాను 43 చోట్ల ప్రభుత్వం జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేసింది. ప్రభుత్వ స్థలాలు లేని చోట ప్రైవేట్ భూముల్ని కొనుగోలు చేసి మరీ లేఅవుట్లు వేశారు. ఇక్కడ చాలా వరకు నిర్మాణాలు పూర్తి చేసుకుని, పేదలు గృహ ప్రవేశాలు చేస్తున్నారు.

వచ్చే నెల్లో 350 గృహాలు పూర్తి

మండలంలో మొత్తం 2,697 మంది అర్హులకు గృహాలు మంజూరయ్యాయి. ఇపుడిపుడే నిర్మాణాలు ఊపందుకున్నాయి. 1905 ఇళ్ల వరకు పునాదులు పూర్తయి, గోడల నిర్మాణం జరుగుతోంది. 257 గృహాలు శ్లాబుల వరకు పూర్తికాగా, 535 గృహాలు పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగి, లబ్ధిదారులు గృహ ప్రవేశం నిర్వహించి, నివాసం ఉంటున్నారు. డిసెంబర్ చివరి నాటికి మరో 350 గృహాలను ప్రారంభించేందుకు లబ్ధిదారులు సిద్ధమవుతున్నారు. మిగిలిన గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వీటిని కూడా మార్చి నాటికి పూర్తిచేసేలా అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు.

త్వరితగతిన మౌలిక సౌకర్యాలు

వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ వగైరా మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు వెచ్చించింది. దీంతో ఆయా శాఖల అధికారులు క్రమపద్ధతిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. గృహనిర్మాణాల కోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లో లేఅవుట్‌ల వద్ద బోర్లు వేశారు. నిర్మాణపనులు ప్రారంభించిన ప్రతి ఇంటి వద్ద కుళాయి కనెక్షన్‌లు ఏర్పాటుచేశారు. దాదాపుగా అన్ని లే అవుట్లలో విద్యుత్ లైన్లు, కనెక్షన్లను పూర్తిచేశారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లకు పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం అధికార యంత్రాంగం రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసి, రంగంలోకి దిగింది.

సొంత స్థలమున్నా.. ఇల్లు మంజూరు

సొంతంగా స్థలం ఉన్నవారు తమ స్థలంలో ఇంటిని నిర్మించుకునేందుకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80 చొప్పున అందిస్తోంది. మండలంలో ఇప్పటికే సొంత స్థలం ఉన్న 310 మందికి ఇళ్లు మంజూరు చేశాం వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. 77 మంది గృహాల నిర్మాణాన్ని పూర్తిచేశారు. పనుల ప్రగతి మేరకు వెంటవెంటనే బిల్లులు కూడా చెల్లించేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు శరవేగంగా తమ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు.

ప్రతి గ్రామంలో ఓ కొత్త ఊరు



జగనన్న కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. రెండు దశల్లో.. డిసెంబర్, మార్చి నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు చేస్తున్నాం. నిర్మాణాల దశల మేరకు లబ్ధిదారుల ఖాతాల్లో పేమెంట్ జమ చేస్తున్నాం. ఇనుము, సిమెంట్, ఇసుకతోపాటు తలుపులు, కిటికీలు వంటి ఉడ్ వర్కు సామగ్రి కూడా ప్రభుత్వమే అందిస్తోంది. ఒక్కో ఇంటికి రూ.లక్షా 80 వేలతోపాటు, డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.30 వేలు ప్రభుత్వం ఇస్తోంది. దీంతో నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.

– కొణతాల మురళి, హౌసింగ్ ఏఈ, అనకాపల్లి

బస్సు యాత్ర విజయవంతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అనకాపల్లిటౌన్: జిల్లాలోని న్యాయవాదులు అందరూ ఈ నెల 9న జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషిచేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు ఆదారి స్వామి వి.వి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఆదివారం న్యాయవాదులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని, దాన్ని ప్రజలకు మరింతగా వివరించేందుకు నిర్వహిస్తున్న బస్సు యాత్రకు వేలాదిమంది ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు డీవీ నరసింహారావు, మళ్ల జగపతి, అడపా సుధాకర్, సీహెచ్‌వి మైఖేల్, సనపల కిషోర్, జి.పరదేశి, శ్రీనివాసరావు, రాజు, ఆచారి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: అనకాపల్లిలో ఈ నెల 9న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కశింకోట, వెదురుపర్తి గ్రామాలకు చెందిన పార్టీ కార్యకర్తలతో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బస్సు యాత్రకు అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: కుల, మతాలకు అతీతంగా ప్రజాస్వామ్యదేశంలో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నామని, రాష్ట్రంలో క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక శారదానది రహదారిలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నూతన భవనాన్ని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతితో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంతీయ భేదాల్లేకుండా పరస్పరం గౌరవించుకునే సంస్కృతి భారతదేశంలో మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వం పాస్టర్ల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తుందన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ జీసస్ ఆశీస్సులు అందరిపైనా ఉండాలని, క్రైస్తవ సోదరులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను, మంత్రి అమర్‌నాథ్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, రాష్ట్ర ఏపీడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, చర్చ్ అధ్యక్షుడు ఎ.జె.మోహన్‌దాస్, కార్యదర్శి కోరాటి జోసెఫ్, కోశాధికారి జి.శేషుకుమార్, ఉపాధ్యక్షుడు నామా విక్టర్‌జోసెఫ్, సహాయ కోశాధికారి నడుపూరి కాసు తదితరులు పాల్గొన్నారు.

సతకంపట్టు కనకదుర్గకు వెండి శఠగోపం అందజేత



వెండి శఠగోపాన్ని అర్చకునికి అందిస్తున్న అప్పారావు దంపతులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయానికి ఆదివారం కర్రి అప్పారావు లలిత శివజ్యోతి దంపతులు సుమారు రూ.లక్ష విలువ చేసే వెండి శఠగోపాన్ని ఆలయ ప్రధాన అర్చకు లు బోగారపు వెంకటరమణకు అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి వెండి శఠగోపాన్ని అందించాలనుకున్నామని, కాస్త ఆలస్యం జరిగిందన్నారు. అనంతరం అప్పారావు దంపతులను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పీవీ రమణ, నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ పూర్వ వైభవానికి కృషి



మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు

కశింకోట: అనకాపల్లి వ్యవసాయ మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గొల్లవిల్లి శ్రీనివాసరావు అన్నారు. బయ్యవరంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన హయాంలో మార్కెట్ పరిధిలో చేపట్టనున్న కార్యక్రమాల గురించి వివరించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతిల సహకారంతో మార్కెట్ పరిధిలో సదుపాయాలు మరింత మెరుగుపరుస్తానన్నారు. గ్రామాలు, పంట భూముల కళ్లాల వరకు రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు వీలుగా లింకు రోడ్లు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే పశు వైద్య శిబిరాలను మరింత విస్తృతం చేస్తానన్నారు. బయ్యవరం పాల సంఘం డైరెక్టర్‌గా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి తాను అంచెలంచెలుగా ఈ స్థాయికి చేరినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనను నియమించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, ఇందుకు కారకులైన మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 9న అనకాపల్లిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు భారీ ఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు, ప్రజలు తరలి వచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కలతోనే కాలుష్య నివారణ



కశింకోట పీహెచ్‌సీ రోడ్డులో మొక్కలు నాటుతున్న గ్రీన్ క్లబ్ సభ్యులు

కశింకోట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లే మార్గంలో అనకాపల్లి గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పనస, మర్రి, బాదం, కానుగ వంటి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జయచంద్ర మాట్లాడుతూ కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. ఏఎంఏఎల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శరగడం నూకరాజు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం వల్ల అనేక జీవ రాశులు అంతరించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడి మానవ మనుగడకు విఘాతం కలుగుతోందన్నారు. ఈ మేరకు చెట్లు పెంచాల్సిన ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించి, ప్రజల్లో అవగాహన పెంచేలా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్, రిటైర్డు అటవీశాఖ అధికారి వినోద్ కుమార్, క్లబ్ సభ్యులు మళ్ల మురళి, సాంబ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి



వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. మండలంలోని హైవేపై ఏఎంఏఎల్ కాలేజీ జంక్షన్ కొత్తూరు వద్ద ఆదివారం రాత్రి వాహనదారులకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన, వారితోపాటు ఇతరుల ప్రాణాలకు హానిచేసే వ్యక్తులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ద్విచక్రవాహనాలపై ఇద్దరు కంటే ఎక్కువమంది ప్రయాణించరాదన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకుకూరలతో ఆరోగ్యం



బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

అనకాపల్లిటౌన్: ఆరోగ్యంగా జీవించాలంటే ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి కార్డియాలజిస్టు గణేష్ తెలిపారు. స్థానిక జూనియర్ క్లబ్ ఆవరణలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ వ్యక్తి ఏడాదికి రెండు సార్లు వైద్య పరీక్షలు చేయించుకుంటే చాలా వ్యాధుల్ని మొదటి దశలోనే గుర్తించవచ్చన్నారు. దానికి సకాలంలో వైద్యం పొందడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తీసుకునే వారు వివిధ రకాలైన వ్యాధుల బారినపడే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. అనంతరం 90 మంది రోగులకు ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, కోశాధికారి నారాయణరావ, క్లబ్ సభ్యులు, రోగులు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకానికి శ్రీకారం



సత్యనగర్ కాలనీలో రక్షిత తాగునీటి పథకానికి భూమి పూజ చేస్తున్న బుల్లిబాబు

కశింకోట: స్థానిక సత్యనగర్ కాలనీలో నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇంటింటి కుళాయి కనెక్షన్ల కోసం రక్షిత తాగునీటి పథకం నిర్మాణానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆదివారం భూమి పూజ చేశారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమకూర్చనున్న నిధులతో ఈ పథకాన్ని నిర్మించనున్నారు. దీని ద్వారా సత్యనగర్‌తోపాటు వడ్డివీధి, గాడివీధుల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో కూడా సుమారు 600 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వనున్నట్లు బుల్లిబాబు తెలిపారు.

ఘనంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆవిర్భావ వేడుకలు



మొక్కను నాటుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: అవినీతి, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు సమాజహితం కోరుతూ సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. స్థానిక ఉడ్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో ఆదివారం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో బిజీగా ఉంటూ, పర్యావరణ పరిరక్షణపై దృష్టిసారించడం అభినందనీయమన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, యూనియన్ జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు బి.కొండలరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం నేడు

కశింకోట: మండలంలోని తేగాడ వద్దనున్న ఎస్‌ఆర్ గార్డెన్‌లో మండల, గ్రామ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకులతో సోమవారం ఉదయం 7.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో జరిగే సమావేశానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ ముఖ్య నాయకులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఏపీయూఎస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎ.లోవ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 2023-26 కాలానికిగాను కార్యవర్గ నియామకానికి పట్టణంలోని ఓ ప్రైవేట్ భవనంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్ని చిరంజీవి, ఎన్నికల నిర్వహణ అధికారి రాపర్తి సత్యనారాయణ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా బండారు సత్యనారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా బీవీఎల్ బాలాజీ, ఉపాధ్యక్షుడిగా డి.శ్రీనివాస్, నరసింహమూర్తి, మహిళా కార్యదర్శులుగా జి.శిరీష, ఉష, కార్యదర్శులుగా కె.రమేష్, ఎం.మహాలక్ష్మి, వి.కేశవరావు ఎన్నికయ్యారు.

11న మాదిగల విశ్వరూప సభ

సబ్బవరం: హైదరాబాద్‌లో ఈ నెల 11న జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గౌటివాడ సామ్రాట్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తూ మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు నాయకులను కలిసి ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నీటిపల్లి ముత్యాలరావు, యువసేన కన్వీనర్ గౌరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం తీరుతో రాష్ట్రానికి అన్యాయం

ప్రజా రక్షణభేరి బస్సుయాత్రలో సీపీఎం నాయకులు



పట్టణంలో ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి రూరల్: తొమ్మిదేళ్లుగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ చేపడుతున్న ప్రజా రక్షణభేరి బస్సుయాత్ర ఆదివారం అనకాపల్లి పట్టణానికి చేరుకుంది. బస్ కాంప్లెక్స్ నుంచి నెహ్రూచౌక్ కూడలి వరకూ యాత్ర చేపడుతున్న నేతలతో కలిసి స్థానిక నాయకులు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ జరిగిన బహిరంగ సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పాలనపై ధ్వజమెత్తారు. విపరీతంగా పెరిగిపోయిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా సామాన్య, పేద వర్గాల ప్రజలు బతకడమే కష్టంగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కాళ్ల లోకనాథం ఆరోపించారు. కేరళ రాష్ట్ర తరహాలో సీపీఎం సూచించిన ప్రత్యామ్నాయ విధానాన్ని అమలు చేస్తే రూపాయికే యూనిట్ విద్యుత్, రూ.400కే వంట గ్యాస్ ఇవ్వొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఏవీ నాగేశ్వరరావు, గంటా శ్రీరాం, జి.కోటేశ్వరరావు, డి.వెంకన్న, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, గనిశెట్టి సత్యనారాయణ, ఎ.బాలకృష్ణ, జి.నాయనబాబు, వై.దేవుడు, దేముడు నాయుడు, నరసింహమూర్తి, నాయుడు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భువనేశ్వరీదేవి అధివాసం



దివ్యాలంకరణలో భువనేశ్వరీదేవి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక పంచాయతీ యాతపాలెం శివారు మణిపురంలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారికి మంగళస్నానాలు చేయించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. చంద్రకాంత పత్రితో అమ్మవారికి అధివాసం నిర్వహించారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్ 2007-08 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి జెడ్పీ హైస్కూల్లో 2007–08 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థుల తొలి సమ్మేళనం విసన్నపేటలోని పడమటమ్మ లోవలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకుని, పరస్పరం పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఆట, పాటలతో ఆనందంగా గడిపారు. తమ విద్యార్థి మిత్రుల్లో ఎవరికి కష్టం వచ్చినా ఆదుకోవాలని, ప్రతి ఏడాది సమావేశం కావాలని తీర్మానించుకున్నారు. అనంతరం అంతా కలిసి ఫొటోలు దిగారు. ఈ ఆత్మీయ కలయికకు సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు హాజరయ్యారు.